# ప్రజాజ్యోతి

కామారెడ్డి నిజామాబాద్

శనివారం | 22 | ఫిబ్రవరి | 2025 | పేజీలు: 5


వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా

## ముందస్తు చర్యలు చేపట్టాలి



జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21. శుక్రవారం తన కార్యాలయ ఛాంబర్ లో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ..మిగతా 3లో

చట్టాన్ని ఉల్లంఘించే

## స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు

డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: శుక్రవారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్తపూర్వ గర్భస్థ పిండా లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశము డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ అధ్యక్షతన డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా ఏ స్కానింగ్ కేంద్రంలో అయినా గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసిన తర్వాత పుట్టబోయే శిశువు ఆడ లేదా మగా అని తెలియజేస్తే పిసిపిఎన్డిటి చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోబడును.మెడికల్ షాపుల్లో ఆబార్షన్ కొరకు వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే అమ్మ రాదని తెలియజేశారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, లేనిచో వారికి రిజిస్ట్రేషన్ కానీ, ..మిగతా 2లో



ఎం.ఎం.పీ.టీ.ఎఫ్ అమలుకు

## సహాయ సహకారాలు అందిస్తాం

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: నిజామాబాద్, ఫిబ్రవరి 21 : వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్టునర్ ఫండ్ (ఎం.ఎం.పీ.టీ.ఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్దేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం జరిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయడానికి ..మిగతా 2లో

## ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

బ్యాలెట్ బాక్సుల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: నిజామాబాద్, ఫిబ్రవరి 21 : నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిజామాబాద్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ..మిగతా 2లో



# చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు

**మొదటి పేజీ తరువాయి...**

రినెవల్స్ కానీ చేయడం జరగదు అన్నారు. అదేవిధంగా జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులను పిసిపి ఎన్డిటి చట్టంపై , బ్రూన హత్యలపై, ఆడపిల్ల ప్రాధాన్యతపై, బేటి బచావో బేటి పడాఓ పై, పాఠశాలల్లో, కళాశాలల్లో, గ్రామ మరియు మండల స్థాయి సమాఖ్య సమావేశాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే అమ్మ ఒడి కార్యక్రమాల్లో, నెలవారి సమావేశాల్లో, ఆశాలు గృహ సందర్శనలో ,ఐకెపి, మెప్మా ,డిఆర్డిఏ నెలవారి సమావేశాలలో వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో నూతనంగా స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం ఒక దరఖాస్తు, స్కానింగ్ సెంటర్ రెన్యువల్ కోసం రెండు దరఖాస్తులు రావడం జరిగింది అన్నారు. ఇంకా ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ ద్వితీ, పిల్లల వైద్యులు డాక్టర్ పి ప్రసన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ బి బిందు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధా, ఆరోగ్య చైతన్య వేదిక నుండి ఘన్పూర్ వెంకటేశ్వర్లు, మెప్మా నుండి మాధురి,డెమో నాగలక్ష్మి , డిహెచ్ఈ జి వేణుగోపాల్ ,దేవేందర్ హాజరైనారు.



# ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**మొదటి పేజీ తరువాయి...**

ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు సమీకృత జిల్లా సముదాయాల కార్యాలయం వీ.సీ హాల్ నుంచి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులతో మాట్లాడుతూ, ఈ.సీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవాలని అన్నారు. షామియానాలు, తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యల గురించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు తరలించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్ ను పీ.ఓ, ఏ.పీ.ఓలు తమ వెంట కరీంనగర్ రిసెప్షన్ సెంటర్ కు చేర్చాల్సి ఉంటుందని, వారితో పాటు సూక్ష్మ పరిశీలకులు కూడా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఓటింగ్ పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేవిధంగా జాగరూకతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ జరపాలని, ఆయా పోలింగ్ కేంద్రాలలో కొనసాగే ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ ముగిసిన మీదట సాధ్యమైనంత త్వరగా బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు చేర్చేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అదనపు డీసీపీ కె.రామచంద్రారావు, ఏ.సీ.పీ రాజవెంకటరెడ్డి, డీటీడబ్ల్యూఓ నాగూరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి

**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 21** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ప్రచారంలో పెద్ద కొడపగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డిమాట్లాడుతూ... మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్ఫోర్స్" డా. వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించమని కోరారు..నరేందర్ రెడ్డి విద్యావేత్తగా , సామాజిక వేత్తగా, పలు సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.. ఎంతో మంది పేద విద్యార్థులకు తన విద్యా సంస్థలలో ఉచిత విద్యను అందిస్తున్నారని తెలిపారు. శాసనమండలిలో పట్టభద్రుల తరపున గళం వినిపించడమే గాక, వారి సమస్యల పరిష్కారం కోసం నరేందర్ రెడ్డి గారు కృషి చేస్తారని అన్నారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ నోటిఫికేషన్స్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు..రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు.ఈ నెల 27 వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి, భారీ మెజారిటీతో గెలిపించి, ప్రజా ప్రభుత్వానికి అండగా నిలబడాలని పట్టభద్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, నాగు, నారాయణ రావు, నాందేవ్, రాములు పాల్గొన్నారు.

## ఎం.ఎం.పీ.టీ.ఎఫ్ అమలుకు సహాయ సహకారాలు అందిస్తాం

**మొదటి పేజీ తరువాయి...**

గల కారణాలు, ఎంఎంపీటీఎఫ్ ను అమలు చేయాల్సిన విధానం, యూఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితిగతుల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలియజేశారు. వారి స్థితిగతులలో మార్పును ఆశిస్తూ అమలుచేయ సంకల్పించిన పైలెట్ ప్రాజెక్టును జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలయ్యేలా చూస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారీ, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఏ.డీ.ఏ ప్రదీప్ కుమార్, సిరికొండ, ధర్పల్లి ఏ.ఓలు నర్సయ్య, వెంకటేష్, యూఎన్ఓ ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సీ జోసెఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్ ఉప్పలపాటి, వాసిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్

## పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ లు



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21.** మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లాల కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్, ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు.ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి రిపోర్ట్ అందించేలా వ్యవస్థ సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సి.ఈ. ఒ. ఆదేశించిన మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలి





## మండల ప్రత్యేక అధికారి కిషన్

**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 21** విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని పెద్ద కొడపగల్ మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. డైనింగ్ హాల్ కు వెళ్లి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పై ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ప్రిన్సిపాల్ సునీతకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని,ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ముచ్చటించారు.వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం కూడా ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించాడు. పరీక్షలో విద్యార్థులు ఒత్తిడికిలోని కాకుండా చూడాలని సూచించాడు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ప్రిన్సిపాల్ సునీత,ఎంపిడిఓ లక్ష్మికాంత్ రెడ్డి , కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కాపూర్‌లో సీసీ కెమెరాలపై అవగాహన

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి (మాచారెడ్డి) ఫిబ్రవరి 21.** శుక్రవారం అక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అక్కాపూర్ గ్రామ పెద్దలు మరియు ప్రజలు తమ వంతుగా తమ విలేజ్లో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి డబ్బులను అందజేయడం జరిగినది. త్వరలోనే ఇట్టి డబ్బులతో అక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇట్టి సందర్భంగా మాచారెడ్డి మరియు పాల్వంచ మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా అన్ని గ్రామాలలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము. ఇట్టి కార్యక్రమంలో మాచారెడ్డి ఎస్సై అనిల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు




# వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి...



కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే వేసవి కాలం ను దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాల్లోని నీటి వనరులను మరమ్మత్తులు చేసి వాడుకలోకి తీసుకురావాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆయా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లను శుభ్రమైన స్థితిలో సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలు సత్వరమే గుర్తించి గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు అరికట్టాలని ఆదేశాలు జారీచేయడం జరిగిందని తెలిపారు. ప్రతీ మండలంలో లేకేజీలను ఆర్కట్టడానికి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలనీ తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా నీటి వృధాను అరికట్టాలని ప్రజలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు గ్రామ పంచాయతీ ఇతర వనరులను వినియోగించుకోవాలని తెలిపారు. మండల అధికారులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు సమన్వయంతో పనిచేస్తూ వేసవి కాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తినపుడు టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4007 కు తెలియజేయాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ కే.రాజేంద్ర కుమార్, బాన్సువాడ ఆర్మూర్ మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ లు స్వప్న, నరేష్, మిషన్ భగీరథ కామారెడ్డి ఇంట్రా ఈఈ డి.రమేష్ లు పాల్గొన్నారు.



## రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలి

### మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి

**నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా పూర్తిస్థాయిలో అందరికి అందజేయాలని నాగిరెడ్డిపేట్ మండల మాజీ జెడ్పిటిసి ఉమన్నగారి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటివరకు రెండు ఎకరాల వరకే రైతు భరోసా ఇచ్చారని మిగతా రైతులకు రైతు భరోసా నిధులు జమ చేయాలని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతలోనే ప్రతి రైతుకు నిధులు జమ చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తప్ప చేతలు కనబడడం లేదని,కల్లిబిల్లి మాటలు మాట్లాడుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప చేసేది ఏం లేదన్నారు.స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓట్లు రాబట్టాలని ఉద్దేశంతో రైతు భరోసా నిధులు ఆపడం కరెక్ట్ కాదని,స్థానిక సంస్థ ఎన్నికల్లో చిత్తుగా కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు ఓడిస్తారన్నారు.ఉచిత బస్సు ప్రయాణం చెప్పుకుంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు కానీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తి చేయలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతమతమవుతున్నారన్నారు.రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చేస్తామన్నారు.



## పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు

**కామారెడ్డి జిల్లా ప్రజాజ్యోతి ప్రతినిధి (పాల్వంచ) ఫిబ్రవరి 21.** శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు వేల్పకుండా విలేజి శివారులో లొట్టివాగు సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు మేము వెళ్ళగా అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకొని, వారి నుండి 7150/-,4 మొబైల్స్, 5 బైక్స్ సీజ్ చేయడం జరిగింది. మరియు కేసు నమోదు చేయడం జరిగింది. ఇట్టి సందర్భంగా మాచారెడ్డి మండల ప్రజలకు ఏమనగా ఎవరు కూడా పేకాట ఆడరాదు, ఆడినట్టు అయితే కఠిన చర్యలు తీసుకొనబడును.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు






**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థినిలకు పలు సాంస్కృతిక సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ దుస్తులు ధరించి అలంకరణలతో అలరించారు. తెలంగాణ, కేరళ, రాజస్థానీ, గుజరాతి, మరాఠీ బెంగాలీ, బంజారా తదితర సంస్కృతులకు ప్రతిబింబించేలా పోటీ నిర్వహించారు. ఆయా ప్రాంతాల స్త్రీల అలంకరణ విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ భారతదేశం అందమైన పూల తోట అని విభిన్న సంస్కృతులు ఆసుల తోటలోని రకరకాల పువ్వులని పరస్పర గౌరవంతో సామరస్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రకాంత్, టీఎస్ కేసి ఇన్చార్జ్ శివకుమార్, డా.నాగనిక, డాక్టర్ బి.అరుణ్ కుమార్, డాక్టర్ గంగారెడ్డి, డాక్టర్ సిద్దిరాజు, డాక్టర్ గోదావరి, చంద్రకాంత్, శశిధర్, రాణి, మోహిన్, సంగీత, దశరథ్ మహమూద్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలో మొక్కలను సంరక్షించాలి





## ఎంపీడీఓ ప్రభాకర్ చారీ

**నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):** నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ చారీ అన్నారు. శుక్రవారం మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని నర్సరీని ఆయన సందర్శించారు. మొక్కలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ మొక్కలకు నీళ్లు పట్టాలని,వర్షాకాలం నాటికీ సిద్ధంగా ఉంచాలని నర్సరీలోని ప్రతి మొక్కను కాపాడాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం గ్రామంలో ఉన్న పారిశుధ్యంను పరిశీలించి నిత్యం చెత్తను సేకరించి గ్రామంలో గల డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు.ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి,తదితరులు ఉన్నారు.

# కామారెడ్డి జిల్లా కోర్టు తీర్పునే తప్పు పట్టిన కామారెడ్డి టిపిఓ గిరిధర్

### ఓకే ప్లాట్‌కు రెండోసారి పర్మిషన్ ఇచ్చిన టిపిఓ కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితుడు



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21.** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ప్లాట్ కు టిపిఓ 2014 ఉన్న పర్మిషన్ చూసి 2024 లో మరో పర్మిషన్ ను కామారెడ్డి టి పి ఓ గిరిధర్ ఇచ్చారు. అప్పటికే ప్లాట్ ను కొనుగోలు చేసి అన్ని రకాలుగా పర్మిషన్లు తీసుకుని ఇంటి నెంబర్ తీసుకొని నివాసం ఉంటున్న వ్యక్తి వద్దనున్న కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని సైతం అది ఒరిజినల్ కాదని కామారెడ్డి డిపిఓ గిరిధర్ తిరస్కరించాడు. దీంతో సదర్ బాధితుడు సకినాల మహేష్ జిల్లా కలెక్టర్ ను గురువారం ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల 220 గుంటల విస్తీర్ణం గల భూమిని పట్టాదారులైన రషీద్ అలీ వద్ద తాను కొనుగోలు చేశాననీ, ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కామారెడ్డి సబ్ రిజిస్టర్ ఆఫీసర్ జిపి లీగల్ ఒపీనియన్ లిఖితపూర్వకంగా తీసుకొని రిజిస్ట్రేషన్ చేసినాడు అన్నారు. అదే విధంగా కామారెడ్డి మున్సిపాలిటీ వారు కూడా స్టాండర్డ్ కౌన్సిల్ వారి నుండి లిఖితపూర్వకంగా లీగల్ ఒపీనియన్ తీసుకొని నాకు భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. నేను పర్మిషన్ తీసుకుని కాంపౌండ్ వాల్ నిర్మించి అందులో గదిని నిర్మించుకోవడం జరిగిందని దీనికి నల్ల కలెక్షన్ తీసుకొని హౌస్ నెంబర్ ను సైతం తీసుకోవడం జరిగిందన్నారు. అప్పటినుండి రెగ్యులర్ గా మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తూ వస్తున్నానన్నారు. 2022 లో ఇట్టి స్థలం మాదే అంటూ పోకల శంకరయ్య, పోకల మహేష్ కొందరు రౌడీలను తీసుకువచ్చి రాత్రి సమయంలో నా స్థలానికి నిర్మించుకున్న కాంపౌండ్ వాల్ ను దోహసం చేశారన్నారు. ఈ విషయంపై తెలుసుకున్న నేను అక్కడికి వెళ్లి అడ్డు చెప్పగా నన్ను చంపేస్తామని బెదిరించారాని దీనిపై తేదీ 7 – 5 – 2022న కామారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోకల శంకరయ్య, మహేష్ లు ఇప్పటికి ఒకసారి ఇంటి పర్మిషన్ కోసం పరిమిషన్ దాఖలు చేసుకోగా తాను తన రిజిస్ట్రేషన్ కాగితాలు పరిమిషన్ లెటర్లను మున్సిపల్ లో చూపించగా అతడికి పర్మిషన్ ఇవ్వలేదన్నారు, అనంతరం 2014లో తనకు ఇంటి పర్మిషన్ ఇచ్చినట్లు చూపెడుతూ తిరిగి పర్మిషన్కు దరఖాస్తు చేసుకోగా ప్రస్తుత టిపీఓ గిరిధర్ కు తన వద్ద ఉన్న కోర్టు కాపీలను చూపించగా ఇవి ఒరిజినల్ కాదని డూప్లికేట్ అని అతనికి పర్మిషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ టిపిఓపై తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్కు ఈనెల 20న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపు లక్ష్యంగా పనిచేయాలి

## బిజెపి ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇంచార్జ్ హైమారెడ్డి





**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో జరుగుతున్న పట్టబద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్సీ ఇంచార్జ్ హైమా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల సరళి-సమీక్ష నాగిరెడ్డిపేట్, లింగంపేట్, ఎల్లారెడ్డి పట్టణం, ఎల్లారెడ్డి రూరల్ బిజెపి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పట్టబద్రులు బాగా ఆలోచించి ఓట్లు వేసే విధంగా ప్రచారం చేయాలన్నారు. అంజిరెడ్డిని ఎమ్మెల్సీకి గెలిపిస్తే ఈ జిల్లాలో వారి సమస్యల పరిష్కారంతోపాటు ఎమ్మెల్సీ పరిధిలోని జిల్లాకు కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయి అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉందని ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. దానిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి బిజెపి కార్యకర్త ప్రతి పట్టభద్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవేందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మర్రి బాలకిషన్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు నర్సింలు, పట్టణఅధ్యక్షులురాజేష్, మండలప్రధాన కార్యదర్శి నరేష్ , మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, మహిళ మోర్చా అధ్యక్షులు సుజాత, బిజెపి నాయకులు ఎస్ఎన్ రెడ్డి,ప్యాలాల రాములు బిజీవైమ్ పట్టణ అధ్యక్షులు కుచులకటి ,శంకర్,రమేష్, గణేష్, గజానంద్, సత్యం, బాలయ్య, అల్లం పండరి గజనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తమ చికిత్స కేంద్రాలను ఎన్ఎంసి 54 యాక్టు ప్రకారం తనిఖీలు చేసి

# చట్ట విరుద్ధంగా ఉంటే అరెస్ట్ చేయాలి

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21.** జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించరు. ఈ సమావేశంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డా. అరవింద్, సభ్యులు డా. పుట్ట మల్లికార్జున్, డా. రమేష్ బాబు, డా. చంద్రశేఖర్, డా. ఉమారెడ్డి, డా. నవీన్, డా.జమాల్, డా.రమేష్ కొటాయ్, డా. రవికిరణ్, డా. గీరెడ్డి రవీందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంపీ, పిఎంపి లకు శిక్షణ ఇచ్చేలా చూస్తామని చెప్పడం సరికాదనీ, వాళ్లకు 3 నెలల్లో శిక్షణ ఇచ్చి ఎలాంటి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఏడెనిమిది సంవత్సరాల పాటు చదువుకుని శిక్షణ పొంది వైద్యులుగా కొనసాగుతున్నాము అన్నారు. ఎన్ ఎం సి 34 యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నాకే ప్రాక్టీస్ చేసుకోవాలి. ఎన్ ఎం సి 54 యాక్టు ప్రకారం తనిఖీలు చేసి చట్ట విరుద్ధంగా ఉంటే అరెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇలా ఎలాంటి శిక్షణ లేకుండా రిజిస్ట్రేషన్ లేకుండా గ్రామాల్లో వైద్యులుగా కొనసాగుతామంటే నాయకులు వారికి ఎలా సపోర్ట్ చేస్తారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తాయి అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు ఆర్ఎంపీ, పిఎంపిల వైపు మాట్లాడటం సరికాదన్నారు. వైద్యులంటే మీకు ఎందుకు వివక్ష. మేము తెలంగాణ బిడ్డలం కాదా. ఆర్ఎంపీ అనే పదం వాడటానికి వీల్లేదు. వీళ్ళు ఎక్కడ రిజిస్టర్ చేసుకున్నారు. పిఎంపి అయినా వారికి ఉన్న గుర్తింపు ఏదైనా ఉందా. గ్రామాల్లో వారికి ఫస్ట్ ఎయిడ్ చేయడానికి మాత్రమే అవకాశం ఉంది. అంతకుమించి చేయడానికి లేదు. కానీ గ్రామాల్లో ఇంజక్షన్ ఇస్తున్నారు, స్టెరాయిడ్స్, యాంటిబెటిక్



మందులు ఇస్తున్నారు. ఇల్లీగల్ అబార్షన్లు కూడా చేస్తున్నారు. ఇలాంటి వాటిని నాయకులు సమర్థిస్తారా.. గ్రామీణ వైద్యులైన తమపై దాడులు చేస్తున్నారనే సాకుతో ఆర్ఎంపీ, పిఎంపిలు ప్రభుత్వానికి గుర్తింపు ఇవ్వాలనడం సరికాదు. కొందరు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారన్నారు. ఆర్ఎంపీ, పిఎంపిలపై మాకు ఎలాంటి ద్వేషం లేదన్నారు. శిక్షణ ఇవ్వాలంటే ఇస్తాం, మేము చెప్పిన విధంగా వాళ్ళు ఉంటారా చెప్పాలన్నారు. ఆర్ఎంపీ, పిఎంపిలను రాజకీయాల కోసం పావులుగా వాడుకుంటున్నారనీ పిఎన్పిఆర్ఎంపీలు గుర్తించాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటన



ప్రజా జ్యోతి మద్నూర్: ఫిబ్రవరి,21 కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల పి. యం. శ్రీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున తడ్గురు శివారులో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర సరిహద్దులోని హొట్టల్ మహాదేవ్ మందిరం ను దర్శించుకొని విద్యార్థులు పూజలు, ధాన్యం నిర్వహించారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు నాగనాథ్, మంజీరా, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

# శోకసంద్రంగా మారిన పెండ్లి వేడుక



**రాజంపేట (భిక్కనూర్) ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)** బిక్కనూర్ మండలం రామేశ్వరం పల్లిలో పెండ్లి వేడుక విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన బాలచంద్రం కుమార్తె వివాహ మహోత్సవం ఉత్సాహంగా కొనసాగుతుండగా, పెండ్లి మండపంలోనే ఆయనకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ, అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. మంగళ వాయిద్యాల మధ్య పెళ్లి వేడుక కన్నీటి ఘోషగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.



## వైభవంగా సంతోషి మాత ఆలయ

# వార్షికోత్సవం

**ప్రజా జ్యోతి మద్నూర్: ఫిబ్రవరి,21:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన సంతోషిమాత ఆలయం వార్షికోత్సవం శుక్రవారం రోజు నా భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, శివుని పూజ, నవగ్రహా పూజలు చేపట్టారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు. తర్వాత భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే భక్తులు మహారాష్ట్ర, బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద, పొతంగల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక లారీ పట్టివేత

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి (పాల్వంచ) ఫిబ్రవరి 21.** గురువారం అర్ధరాత్రి ఫరీద్ పేట్ గ్రామంలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా లారీ లో ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఇట్టి సందర్భంగా మాచారెడ్డి ఎస్సై అనిల్ మండల ప్రజలకు ఏమనగా ఎవరైనా ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకొనబడును.